## క్లుప్తంగా

### విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దు
తహసీల్దార్ కె.నగేష్



గురజాల : విధి నిర్వహణలో బీఎల్‌వోలు అలసత్వం వహించవద్దని తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా పలు పోలింగ్ బూత్‌లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం–6 18, ఫారం–7 4, ఫారం–8 21 వచ్చినట్లు తెలిపారు. మొత్తం 43 దరఖాస్తులు బీఎల్‌వోలకు అందించినట్లు తెలిపారు.

### ముస్లింలకు అండగా ఉంటాం
ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



దాచేపల్లి : ముస్లింలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బ్రహ్మణగడ్డలోని అరబ్బీ పాఠశాలలో ఐదేళ్ల పాటు అలీం కోర్సు పూర్తి చేసుకున్న 15 మంది బాలికలక ఆయన సర్టిఫికెట్లను ఆదివారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముస్లింల ఎదుగుదలకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పనులు చేశామని, భవిష్యత్‌లో వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు వ్యక్తిగతంగా తనవంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు. అనంతరం పలువురు ముస్లిం మతపెద్దలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అరబ్బీ పాఠశాల నిర్వాహకుడు, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా, ముఫ్తీ యూనిస్, నాయకులు బెల్లంకొండ బద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, అక్కినపల్లి బాలయ్య, షేక్ వలి, పెదలాల, రెహ్మాన్, కౌన్సిలర్ షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం
మాచవరం : మండల కేంద్రమైన మాచవరంలోని సచివాలయంలో శంకర్ కంటి ఆసుపత్రి అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా కళ్లజోళ్లను త్వరలోనే అందిస్తామని, శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

### ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



గురజాల రూరల్ : ఆర్యవైశ్యుల అభివృద్ధికి టీడీపీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మాడుగుల రోడ్డులోని ఆర్యవైశ్యుల ఆరామ క్షేత్రం, వృద్ధాశ్రమంను ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల ఆర్యవైశ్యుల చిరకాల కోరిక ఆరామక్షేత్రం ప్రారంభించడం సంతోషించదగిన విషయమన్నారు. ముందుగా గాంధీ బొమ్మ సెంటర్‌లోని గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, యేచూరి శ్రీనివాసరావు, ఆకుల పిచ్చయ్య గుప్తా, మన్నెం ప్రసాద్, పాదర్తి రాంబాబు, చిన్నికొండలు, పుల్లారావు, పంతంగి నాగేశ్వరరావు తదితరులున్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తిక మాసంలో దీపాలు వెలిగించడం, ఆత్మజ్ఞానం అంశాలపై గ్రామస్తులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్.అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై.రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్ తదితరులున్నారు.

# మనసు పెడితే మానససరోవరమే...

- పర్యాటకానికి బుగ్గవాగు రిజర్వాయర్ అనుకూలం
- నిరాదరణకు గురవుతున్న వైనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాలకులు, అధికారులు

రెంటచింతల: భగభగమండే ఎండలకు రాష్ట్రంలోనే పేరుపొందిన రెంటచింతలకు కూతవేటు దూరంలో ఉన్న మంచికల్లు గ్రామ శివారులోని బుగ్గవాగు రిజర్వాయర్ మనసుపెడితే మానస సరోవరమే అవుతుంది. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పల్నాటి కోనసీమగా విరాజిల్లుతున్న మంచికల్లు గ్రామానికి దక్షిణాన ఒక కి.మీ. దూరంలో ఉన్న ఈ రిజర్వాయర్‌కు 1967 జులై 18న అప్పటి ఉప ప్రధానమంత్రి మొరార్జీదేశాయ్ శంకుస్థాపన చేశారు. రిజర్వాయర్‌లో బుగ్గమల్లయ్య దేవాలయం ఉండటం కారణంగానే దీనికి బుగ్గవాగు రిజర్వాయర్ అనే పేరు వచ్చిందని చరిత్ర ద్వారా తెలుస్తుంది.

- నాగార్జున సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంలో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సూచనల మేరకు ఏఎస్ కాలువల వెంట ఖాళీ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అందంగా అభివృద్ధి చేశారు.



బుగ్గవాగు రిజర్వాయర్

- తెలుగు సినిమా తొలి రోజులలో ఇక్కడ సినిమా షూటింగ్‌లు జరిగినట్లు ఈ ప్రాంతానికి చెందిన వృద్ధులు చెబుతున్నారు. పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పర్యవేక్షణ లేకపోవడం వలన ఆనాడు ఇక్కడ ఏర్పాటు చేసిన కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.
- నాగార్జున సాగర్‌కు 18 మైళ్ల దూరంలో ఉన్న ఈ రిజర్వాయర్‌ను 4.8 స్క్వేర్ మైళ్లు (3100 ఎకరాలు) విస్తీర్ణం, 3.46 టీఎంసీల సామర్థ్యంతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రిజర్వాయర్ చుట్టూ అప్పట్లో పార్కులు, పైలాన్‌లు నిర్మించిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తున్నారు. ఈ ప్రాంతం రెంటచింతల, మాచర్ల, దుర్గి, గురజాల మండలాలకు సరిహద్దుగా ఉంది.

#### పర్యాటక హబ్‌గా ఏర్పడే అవకాశం ఉంది
ఇప్పటికే పర్యాటక కేంద్రంగా ఉన్న ఎత్తిపోతల, అనుపు, నాగార్జునసాగర్‌లకు ఈ రిజర్వాయర్ దగ్గరగా ఉండటం వలన దీనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచినట్లయితే పర్యాటక హబ్‌గా ఏర్పడే అవకాశముందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రాధాన్యత కల్గిన ఈ రిజర్వాయర్ వరకు రహదారి సౌకర్యంతోపాటు పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వందల ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. రిజర్వాయర్‌లో పర్యాటకులు బోట్ షికార్లు చేస్తూ ఆహ్లాదం పొందవచ్చు. ఎన్నో ప్రత్యేకతలు ఉన్న పల్నాడు ప్రాంతంలో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అనువైన ఈ ప్రాంతాన్ని పాలకులు, అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. రిజర్వాయర్ సమీపంలో 1942లోనే నరసరావుపేటకు చెందిన గొడవర్తి లక్ష్మయ్య వేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సుమారు 11 లక్షల ఎకరాలకు సాగు నీరు ఈ రిజర్వాయర్ ద్వారానే వెళ్లాల్సి ఉంది.

#### పర్యాటక కేంద్రానికి అనుకూలం



బుగ్గవాగు రిజర్వాయర్ పర్యాటక కేంద్రానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వం బుగ్గవాగు రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసినట్లయితే అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు సందర్శించడం వలన ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఉదయం, సాయంకాల సమయాలలో ఎగసిపడే అలలు చూస్తూ అలసిన మనస్సులతో రిజర్వాయర్‌లో బోట్ షికార్లు చేస్తూ ఎంతో ఆహ్లాదం పొందవచ్చు.

– కట్టమూరి నాగేశ్వరరావు, వాసవి అమ్మవారి దేవస్థానం చైర్మన్

#### భూములు అందుబాటులో ఉన్నాయి



ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన వందల ఎకరాల అడవి భూములు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ ఆహ్లాదకమైన వాతావరణం ఉండటం వలన వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు కొంత సేద తీరడానికి ఇక్కడకు వచ్చే అవకాశం ఉంటుంది. బుగ్గవాగు రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు పల్నాడు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి.

–మద్దిరాల కృష్ణారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, రెంటచింతల

#### ప్రజలకు మేలు జరుగుతుంది



ఎంతో విశాలమైన బుగ్గవాగు రిజర్వాయర్‌ను అన్ని విధాలుగా పర్యాటక కేంద్రంగా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి కృషి చేయాలి. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు ఇక్కడ ప్రజలకు ఆర్థికంగా మేలు జరుగుతుంది. దగ్గరలోనే అనుపు, ఎత్తిపోతల, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఉండటంతో ఈ ప్రాంతం మొత్తం ఓ పర్యాటక హబ్‌గా ఏర్పడే అవకాశముంటుంది.

– నారాయణపురం శ్రీనివాస్, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు

### కార్యకర్తలకు అండగా ఉంటాం
మాజీ ఎమ్మెల్యే కాసు



దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం మాట్లాడారు. తక్కెళ్లపాడుకి వచ్చిన ఆయనకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని, కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే కాసు చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి వచ్చి కార్యకర్తలందరిని కలుస్తానని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ జంగిలి నరసింహారావు, మాజీ ఎంపీటీసీ గుడూరి గోవర్ధన్‌రావు, నాయకులు మేడతి నరసింహారావు, రాచకొండ కోటయ్య, నరసింహారావు, ద్రోణాదుల రమణ తదితరులున్నారు.

### రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



పిడుగురాళ్ల: ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కొండమోడు కోటిరెడ్డి ఆశ్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లోకసాని అంజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఈపూరి సంజీవరెడ్డి, సెక్రటరీ గుర్రం వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీ ముత్యం ఉమామహేశ్వరరెడ్డి, ట్రెజరర్ నామాల కోటిరెడ్డి, అఫీషియల్ మెంబర్‌గా బోగిరెడ్డి అంజిరెడ్డిలను ఎన్నుకున్నారు.

## కార్తిక వన సమారాధనల సందడి



వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సత్యనారాయణ వ్రతం



పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

మాచర్ల: కార్తిక మాసం చివరి ఆదివారం పురస్కరించుకొని పలు సామాజిక వర్గాల ఆధ్వర్యంలో ఆదివారం భారీ స్థాయిలో కార్తిక వన సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సొసైటీ కాలనీ సమీపంలోని నరిశెట్టి కళ్యాణ మండపంలో కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక మాస ఉత్సవాలను జరిపారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు చిరుమామిళ్ల కృష్ణయ్య, యాగంటి మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీలు, ఎంపీపీ యేచూరి సునీత, జిల్లా కమ్మ సేవా సమితి నాయకులు గోనుగుంట్ల రామ్మూర్తి, బండ్ల బ్రహ్మం, సాయి ప్రసన్న మెడికల్స్ లక్ష్మీనారాయణ, చెరుకూరి నరసింహారావు, ప్రసాద్, బండ్ల శ్రీనుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 3 వేల మందికి అన్నదానం చేశారు.

**లింగాయత్ సేవా సంఘం ఆధ్వర్యంలో**

పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో వీరశైవ లింగాయత్ గణార్చన సంఘం వారి ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కనకంటి శంభుప్రసాద్, ఆడికె కోటేశ్వరరావు, మక్కపాటి ఆంజనేయులు, తాడిశెట్టి సాంబశివరావు, మశీదు కోటేశ్వరరావు, వాసు పలువురు లింగాయత్ సంఘ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

**పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో**

భక్త మార్కండేయ పద్మశాలీ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు గోలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీవీఎస్ గార్డెన్స్‌లో కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నుంచి పలువురు నాయకులు ఈ కార్యక్రమానికి విచ్చేసారు. పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పద్మశాలీ సంఘ నాయకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

**సరదాగా గడిపిన ఉద్యోగులు**

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ కుడి జలవిద్యుత్ కేంద్రం ఉద్యోగులు మాచర్ల మండలంలోని అనుపులో ఆదివారం కార్తిక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల కుటుంబ సభ్యులందరూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట పాటలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో కుడి జల విద్యుత్ కేంద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ అప్పాజి, డీఈలు రాజారెడ్డి, రమణారావు, మోహన్‌బాబు, ఏఈలు రేవతి, రాణీభాయి, జేఈ రాణి, ఉద్యోగులు సూరజ్‌చంద్, సాంబశివరావు, రామకృష్ణ, విజిత్, లక్ష్మి, బీబీ, ఎస్‌పీఎఫ్ ఏఎస్ఐ సత్యమూర్తి, జెన్‌కో హెడ్ కానిస్టేబుల్స్ నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అనుపు కార్తిక వనభోజనాలలో...



మాట్లాడుతున్న భక్త మార్కండేయ పద్మశాలీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్

### సత్రశాల దేవస్థానానికి ఇత్తడి హారతులు అందజేత
రెంటచింతల: మండల పరిధిలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతన శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన చక్రవరం నాగ హృతికేష్, బుచ్చి వెంకటరాజు ఇత్తడి పళ్లెం, 11 ఇత్తడి హారతులు అందజేసినట్లు ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం అర్చకులు సీహెచ్ మల్లికార్జునశర్మ ఆదివారం తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా దేవస్థానంలోని స్వామి వార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలి వస్తున్నట్లు తెలిపారు. ఇత్తడి పళ్లెం, 11 ఇత్తడి హారతులు పూజా కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ముదిరాజుల కార్తిక వన సమారాధన
దాచేపల్లి : నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో పల్నాడు ప్రాంత ముదిరాజుల 6వ కార్తిక వనసమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పల్నాడు ప్రాంతంలోని వివిధ ప్రాంతాల నుంచి ముదిరాజులు భారీగా తరలివచ్చారు. ముదిరాజుల కులదైవానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు ముదిరాజుల నాయకులు వారి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ముదిరాజులు ఐకమత్యంగా ఉండాలని కోరారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం ముదిరాజుల కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముదిరాజులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన చెప్పారు. కార్తిక వనసమారాధనలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షుడు యల్లబోయిన రామకోటయ్య, ఉపాధ్యక్షుడు బొడ్డు నరసింహారావు, కార్యదర్శి గుర్రం నరసింహారావు, గౌరవ అధ్యక్షుడు నార్ల కాశయ్య, యూత్ ప్రెసిడెంట్ గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు జాలెబోయిన పాపారావు, కొరటా మల్లిఖార్జునరావు, సిట్టెటి రాజేంద్రప్రసాద్, మేడబోయిన నరసింహారావు, బొడ్డు సాయికుమార్ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ముదిరాజుల నాయకులు

## సామాజిక వర్గాలు అభివృద్ధి చెందాలి
కార్తిక సమారాధనలో పలువురు నేతల పిలుపు




మాట్లాడుతున్న విశాఖపట్నం ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్

మాచర్ల: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం మాచర్ల పట్టణంలోని పలు దేవాలయాలలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ, ఆర్య వైశ్య సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా అనేక మంది యాదవులు జెండాలతో బైకులు, ప్రత్యేక వాహనాలలో మాచర్ల పట్టణానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశాఖపట్నం నియోజకవర్గం 2 ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే భగత్, ఉమ్మడి రాష్ట్ర యాదవ సంఘ నాయకులు మధు, సురేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు తాళ్ల వెంకటేశ్వర్లు యాదవ్, బండారు రామకృష్ణ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కామనబోయిన కోటయ్య, వై నాగరాజు, రామకృష్ణ, జీవీఆర్, జింకల నాగేశ్వరరావు యాదవ్, గుండాల శ్రీనివాసయాదవ్, మున్నా రాంబాబు, జల్లెళ్ళ ఏడుకొండలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి యాదవ సంఘం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. వంశీకృష్ణ యాదవ్, జంగా కృష్ణమూర్తి, నోముల భగత్‌లు మాట్లాడుతూ యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా ముందుకెళ్లాలంటే చదువు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఉత్తమ సేవలందించిన యాదవ సంఘ నాయకులకు ప్రశంసాపత్రాలందించారు. సురేష్, సింగు నాగేశ్వరరావు, సాంబశివరావు, రాజబోయిన మధు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో**

పట్టణంలోని నగరేశ్వరస్వామి దేవాలయంలో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన సందర్భంగా ఆదివారం ఉదయం అర్చకులు వంశీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, దేవాలయ అధ్యక్షులు మారం వాసు, కాళంగి అప్పారావు, వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షులు భవనాసి వెంకటేశ్వర్లుతో పాటు కార్యవర్గ సభ్యులచే పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలా వాసు, అవాంట్ సత్యం, జి.వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపకులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, పలువురు ఆర్య వైశ్య పెద్దలు, నాయకులు తదితరులున్నారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు.

### వన సమారాధనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే
పిడుగురాళ్ల: కార్తిక వన సమారాధన కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం పాల్గొన్నారు. పట్టణ పిల్లుట్ల రోడ్డులోని మూడు బట్టీల వద్ద వేద గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన మహా లింగార్చన కుంకుమపూజ, రుద్ర హోమాది పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణ వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా దేవరంపాడులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద జరిగిన కాకతీయ కమ్మ వన సమారాధన అలాగే కొండమోడులో జరిగిన కాపు సమారాధన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

## అందరి కలయికే కార్తిక వన సమారాధన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: అందరు కలిసి స్నేహభావంతో ఉండేందుకు కార్తిక వన సమారాధన కార్యక్రమం తోడ్పడుతుందని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని కొండమోడులోని మహర్షి కోటిరెడ్డి ఆశ్రమంలో ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక మాస వన సమారాధన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఆశ్రమంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు పెద్దలతో సమావేశం, ఇష్టాగోష్టి నిర్వహించారు. మహిళలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. స్కాలర్స్ పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ అందరు ఒక చోట కలిసి సంతోషంగా గడిపేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. అలాగే తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గురజాల నియోజకవర్గానికి అభివృద్ధి పథంలో నడిపించామని, పిడుగురాళ్ల పట్టణాన్ని అభివృద్ధి చేశామన్నారు. 600 పడకల ప్రభుత్వ హాస్పటల్ నిర్మించటం జరిగిందని, పిడుగురాళ్ల పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేశామని, ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించటం జరిగిందని, పేదలకు ఇళ్ల పట్టాలు అందించామన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అందించటం జరిగిందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా పని చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత మోకాళ్ల ఆపరేషన్



చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పల్నాడు హాస్పటల్ ఆధ్వర్యంలో హ్యాపీ నీడ్స్ కార్యక్రమాన్ని 2025 జనవరి 1 నుంచి ప్రారంభిస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా పేదలకు ఉచిత మోకాళ్ల ఆపరేషన్లు నిర్వహించటం జరుగుతుందని చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పల్నాడు హాస్పటల్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పటల్ సంయుక్తంగా హ్యాపీ నీడ్స్ కార్యక్రమంలో పేదలకు మోకాళ్ల ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించబోతున్నామన్నారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారయినా ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇంప్లాంట్ కాస్ట్ పేషెంట్ భరించాల్సి వస్తుందని, మందులు, ఆపరేషన్, హాస్పటల్ చార్జీలు ట్రస్ట్, పల్నాడు హాస్పటల్ అందించటం జరుగుతుందన్నారు. ఈ సౌకర్యాలను పొందాలని ఆయన పేర్కొన్నారు.